క్లుప్తంగా

ఫెయిత్ హోంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న వీరేష్

ఆదోని అర్బన్: మదర్, ఫాదర్స్ డే సందర్భంగా పట్టణంలోని ఫెయిత్‌హోంలో అంబేడ్కర్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కుంకనూరు వీరేష్ సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. హోంలోని బాల బాలికలకు రకరకాల పిండి వంటలను స్వయంగా ఆయనే వడ్డించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను గుర్తు పెట్టుకునేందుకు తనవంతుగా అన్నదానం చేసినట్లు చెప్పారు.

ఎస్టీయూ రాష్ట్ర అకడమిక్ సభ్యుడిగా మహాదేవప్ప


మహాదేవప్ప

ఆదోని సెంట్రల్: ఎస్టీయూ రాష్ట్ర అకడమిక్ సభ్యులుగా బి. మహాదేవప్ప ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమని ఆదోని, కౌతాళం ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్ బాబు, గురుసాగర్, తాయన్న, ఖాదర్ బాషా, అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ శనివారం విజయవాడలో జరిగిన ఎస్టీయూ సమావేశంలో సీనియర్ నాయకులైన మహాదేవప్ప ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఆయన సేవలను గుర్తించి ఏకగ్రీవంగా అకడమిక్ సభ్యులుగా ఎన్నుకున్నారని చెప్పారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి


సీనియర్ సంగీత కళాకారులకు సన్మానం చేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని విరుపాపురం గ్రామ సమీపంలోని స్వయంభూ శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు ప్రతాప్‌స్వామి, నల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. అదేవిధంగా మదర్స్, ఫాదర్స్ డే సందర్భంగా లలితకళా సేవా సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సంగీత విద్వాంసులకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నల్లారెడ్డి, సంగీత విద్వాంసులు అబ్దుల్లా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో కార్డన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు, బైకులను చూపుతున్న త్రీటౌన్ పోలీసులు

ఆదోని టౌన్: పట్టణంలోని విజయనగర్ కాలనీ, అరుంజ్యోతినగర్, ఎన్‌జీఓస్ కాలనీల్లో ఆదివారం తెల్లవారుజామున వన్, టూ, త్రీ టౌన్ పోలీసులు కార్డన్ సెర్చ్ చేశారు. డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఆ కాలనీలో తెల్లవారుజామున అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అందులో 76 అక్రమ మద్యం ప్యాకెట్లు, ఎలాంటి రికార్డులు లేని నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను కూడా అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు తేజమూర్తి, గోపి, నరసింహరాజు, విజయలక్ష్మి, ఎస్ఐలు మధుసూదన్, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, పీరయ్య, తిరుపాల్ పాల్గొన్నారు.

ఇతిహాసాలపై అవగాహన


సందేశమిస్తున్న ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: పురాతన ఇతిహాసాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీజగన్నాథ మందిరంలో ఆదివారం నగర సంకీర్తన, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన, రాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రఘునందన సేవక్ ప్రభు సందేశమిస్తూ రామాయణ భారత భాగవతాల్లోని అంశాలు మన జీవితానికి ఉన్నత మార్గాన్ని చూపుతాయన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవి శ్వేత పత్రాలు కావు.. సాకు పత్రాలు

- కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయలేక కాలయాపన
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక


మాట్లాడుతున్న బుట్టా రేణుక, చిత్రంలో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయలేక సీఎం చంద్రబాబు నాయుడు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద బురద చల్లేందుకు విడుదల చేస్తున్నవి శ్వేత పత్రాలు కావని అవన్నీ సాకు పత్రాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, యువ నాయకుడు బుట్టా ప్రతూల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అసెంబ్లీలో బడ్జెట్ పెట్టకుండా కేవలం ఓటాన్ బడ్జెట్ పెట్టడం ప్రజలను మభ్యపెట్టేందుకే అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో నుంచి దిగిపోయేనాటికి రూ.8 వేల కోట్లు రాష్ట్ర ఖజానాలో వుందన్నారు. అదే 2019లో టీడీపీ ప్రభుత్వం కేవలం వంద కోట్లు మాత్రమే ఖజానాలో వుంచి వెళ్లిందని గుర్తు చేశారు. అయినప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు ఐదేళ్ల కాలంలో రూ.2.71లక్షల కోట్లు అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మభ్యపెట్టారని, అదేవిధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో రైతుల భూములన్నీ వైఎస్ జగన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ప్రజల్లో ఆందోళన కలిగించి లబ్ధిపొందారన్నారు. తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాలంటే భయమేస్తుందని చెబుతూ వాటిని అమలు చేయకుండా కాలం వెళ్లదీసేలా పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు.

సంపద సృష్టిస్తామని చెప్పి..

రాష్ట్రాభివృద్ధికి సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు ఆ విషయాన్ని పక్కన పెట్టి.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలకే పరిమితమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో తల్లికి వందనం, రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం నేటికి ఇవ్వలేదని వాటికోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్ భారీ వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో రైతులు నష్టపోయాని ఈ క్రాప్ నమోదు చేయకపోవడం, పంటల బీమా ప్రీమియంను టీడీపీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో లక్షలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో తమ పార్టీ కార్యకర్తలు, అమాయకులపై అక్రమంగా ఎస్సీ,ఎస్టీ తదితర కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యకర్తలకు అండగా వుంటామని అభయమిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు మహబూబ్‌బేగ్, ముగతి విరూపాక్షిరెడ్డి, గడ్డంనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నందవరం : మండలంలోని కనకవీడు గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త సత్యరాజు (59) గుండెపోటు ఆదివారం తెల్లవారు జామున మృతిచెందారు. అలాగే సోమలగూడూరు గ్రామానికి చెందిన పల్లన్న నెలన్నర క్రితం చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమలగూడూరులో పల్లన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకవీడులో సత్యరాజు పార్థీవదేహానికి మాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతోపాటు బుట్టా నీలకంఠ, యువ నాయకుడు బుట్టా ప్రతుల్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలాలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో సోమవారం ఉదయం వేలాలు జరుగుతాయని చెప్పారు. వేలాల్లో పాల్గొనే వారు ఆధార్, ఫాన్ కార్డు కాపీలు, 10 శాతం నగదును సెబ్ స్టేషన్‌లో డిపాజిట్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వేలాల్లో వాహనాలను పొందిన వారు వెంటనే నగదును చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రిజర్వాయర్లను నింపండి

కోసిగి: మండలంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్‌లలో భాగంగా పులికనుమ, దుద్ది, మూగలదొడ్డి రిజర్వాయర్లను నీటితో నింపాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు కారణంగా హోస్పేట్ డ్యామ్ నుంచి తుంగభద్ర నదికి నీటిని వదిలారని చెప్పారు. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో వర్షాలు అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. తుంగభద్ర నదిలో నీరు దిగువ ప్రాంత్రాలకు వెళ్లకుండా ముందస్తుగానే మండలంలోని రిజర్వాయర్లును నింపాలని కోరారు. దీంతో కనీసం ఎల్లెల్సీ చివరి ఆయకట్టు భూములకు సాగునీరే అందే అవకాశం ఉందన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఇంటింటా జ్వర పీడితులు
- పడకేసిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని వైద్య సిబ్బంది


గోనెగండ్లలో ఓ ప్రైవేట్ క్లినిక్‌లో చికిత్స పొందుతున్న జ్వర బాధితుడు

గోనెగండ్ల : మండలంలోని పలు గ్రామాల్లో విష జ్వరాలు విభృంభణ కొనసాగుతోంది. ప్రతి ఇంటా జ్వర పీడితులు ఉన్నారు. ఒకరికి తగ్గితే మరొకరికి, ఒకేసారి ఇద్దరు, ముగ్గురికి జ్వరాలు వస్తుండటంతో అయా కుటుంబ సభ్యులు ఆస్పత్రుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆదివారం వస్తే సెలవు అన్నట్టుగా వైద్య సిబ్బంది తీరు ఉందని, దీంతో ఆదివారం రోజున జబ్బుచేస్తే ప్రైవేట్ ఆస్పత్రులను సంప్రదించాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీజనల్ వ్యాధులపై గ్రామ గ్రామానా సర్వే నిర్వహించి, బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నప్పటికీ మండలంలో ఆ ప్రక్రియ కనపడడం లేదు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

మండలంలోని పలు గ్రామాల్లో పారుశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ప్రధాన రహదారి వెంట పేడ దిబ్బలు, హోటళ్ల నిర్వాహకులు చల్లిన నీళ్లు నిల్వ ఉంటున్నాయి. మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండి నిరు పారకుండా అడ్డుపడుతున్నాయి. దీంతో దోమల ఉధృతి పెరిగి జ్వరాలు వేగంగా వ్యాపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే పలువురు టైఫాయిడ్, డెంగీ, మలేరియా జ్వరాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్న జనం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో సామన్య ప్రజలు జ్వరాలు సోకి ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అత్యవసరమైన సమయంలో స్థానిక ఆస్పత్రికి వెళితే అక్కడ సరైన వైద్యం అందడం లేదని, ఎమ్మిగనూరు, కర్నూలు ఆస్పత్రులకు వెళ్లమని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

పూడిక తీశారు.. చెత్త వదిలేశారు!


డ్రైనేజీ నుంచి తీసిన పూడికను తొలగించకుండా ఉంచిన దృశ్యం

పెద్దకడబూరు: మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో డ్రైనేజీ నుంచి తీసేసిన మురుగు వారం రోజులైనా తొలగించేవారే కరువయ్యారు. దీంతో దుర్వాసనతో పాటు దోమలు అధికమయ్యాయని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటివల ఆ గ్రామ సర్పంచ్ అనారోగ్యంతో చనిపోయినప్పటి నుంచి ఆ గ్రామ బాగోగులు పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి మురుగును తొలగించి ప్రజలను రోగాలబారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు.

ఎస్‌ఏ పీఈటీ అసోసియేషన్ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వీవర్స్ జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఎమ్మిగనూరు జోన్ ఎస్ఏ పీఈటీ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, పుల్లన్న, పరిశీలకుడు రాజా రాంమోహన్‌ల అధ్యక్షతన ఎన్నిక జరిగింది. జోన్ అధ్యక్షుడిగా ఎం.బజారప్ప, ఉపాధ్యక్షుడిగా రామన్న, కార్యదర్శిగా యు.రవీంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జేబి కృష్ణ, సహాయకార్యదర్శిగా ఉమాపతి, కోశాధికారిగా ఈరన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తి అదృశ్యం


పెద్ద దస్తగిరి (ఫైల్)

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన పెద్ద దస్తగిరి అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు ఆదివారం దేవనకొండ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. పలుచోట్ల విచారించినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. సీఐ మాట్లాడుతూ.. ఆచూకీ తెలిసిన వారు 9603457129 నంబర్‌కు సమాచారం అందించాలని చెప్పారు.

వేడుకగా సాయి శత రుద్రీయం

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఇస్కాల సత్రం ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి పురస్కరించుకొని ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వెంకటరమణ కాలనీలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నగరంలోని వీధుల్లో స్వామి వారి చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రశాంతి పతాకావిష్కరణ, గోమాత పూజ, శ్రీ సత్యసాయి ప్రేమ తరు (మొక్కలు నాటడం), మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు డి.సాయిక్రిష్ణా రెడ్డి, కన్వీనర్ జి.విశ్వనాథం, రాష్ట్ర వేద ధ్యాన ఇన్‌చార్జ్ హరిశర్మ, డాక్టర్ రంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా సినారే జయంతి


సినారే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్న ఇద్దరు కవుల్లో డాక్టర్ సి.నారాయణ రెడ్డి ఒకరు కావడం తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సినారే 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినారే రచనలు, సాహిత్యం ప్రజల గుండెల్లో ఎప్పటికి నిలిచి ఉంటాయన్నారు. అనంతరం కొలక లూరి శ్రీ సాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ×కౌసల్యా సుప్రజా రామా× సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరించింది. జీఎల్‌వీ లక్ష్మి నిర్వహణలో ప్రదర్శితమైన ఈ నాటికకు ఆకెళ్ల శివప్రసాద్ కథామూలం అందించారు. గోపరాజు విజయ్ దర్శకత్వం, స్నిగ్ధ నాటకీకరణ చేశారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు లక్ష్మీకాంతరావు, యాగంటీశ్వరప్ప, బాల వెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, రచయిత గద్వాల వీరన్న, జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపు శాల అంకయ్య, సీనియర్ కళాకారులు దస్తగిరి, క్రిష్టఫర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టం ఎవరికీ చుట్టం కాదు

- ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి
- నూతన క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ గోపి


మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కౌతాళం: చట్టం ఎవరికీ చుట్టం కాదని, అందరూ చట్టానికి లోబడి ఉండాలని ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. నూతన క్రిమినల్ చట్టాలపై అవగహన సదస్సును ఆదివారం స్థానిక పోలీస్టేషన్‌లో కోసిగి సీఐ ప్రసాద్‌తో కలసి నిర్వహించారు. కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో డీఎస్పీ మాట్లాడుతూ.. 1860 సంవత్సరంలో రచించిన ఐపీసీ, 1872లో రచించిన ఐఈఏ, అలాగే 1973లో వచ్చిన సీఆర్‌పీసీల స్థానాల్లో మారిన పరిస్థితులకు అనుగుణంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ మరియు భారతీయ సాక్ష్యా అధినయం 2023 చట్టాలు ఈనెల 1 నుంచే అమలు అవుతున్నాయని, ఈ విషయాలన్ని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలనుగుణంగా ఫిర్యాదు చేస్తే దానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ రిపోర్టు, మేసేజ్ మీ ఫోన్‌కు వస్తుందన్నారు. ప్రతి విషయాన్ని మీ మొబల్‌లో చూసుకోవచ్చు చెప్పారు. సదస్సులో సర్పంచ్ పాల్ దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, ఉప్పరహాల్ ఏకాంబర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

ఆదోని టౌన్: పట్టణంలోని టూటౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో ఆదివారం కొత్త చట్టాలపై వాహనదారులకు, ఉపాధ్యాయులకు, డ్రైవర్లకు, న్యాయవాదులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. టూటౌన్ సీఐ గోపీ, ట్రాఫిక్ సీఐ మంజునాథ్ వారి వారి పోలీస్‌స్టేషన్‌లలో నూతన మూడు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఆటో డ్రైవర్లు అమలులోకి వచ్చిన ప్రభుత్వ కొత్త నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ అవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు డ్రెస్ కోడ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని చెప్పారు. కొత్త నిబంధనలు ప్రకారం నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు ఎక్కువ ఉండటుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తదిరుతులు పాల్గొన్నారు. అలాగే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు సమావేశం నిర్వహించి నిబంధనలపై అవగాహన కల్పించారు.

డ్రైనేజీ విషయంలో ఘర్షణ

ఆదోని అర్బన్: పట్టణంలోని గొళీపేటలో డ్రైనేజీ విషయంలో ఇరువర్గాలు పరస్పరం మారుణాయుధాలతో దాడులు చేసుకోగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వన్ టౌన్ సీఐ తేజమూర్తి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. డ్రైనేజీ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుందని, అందులో తిరుమలేష్ చేతికి తీవ్ర గాయమవ్వగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పాముకాటుకు గురై మహిళకు అస్వస్థత


చికిత్స పొందుతున్న మహిళ పద్మ

ఆదోని అర్బన్: మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన పద్మ అనే మహిళ ఆదివారం తెల్లవారుజామున పాము కాటుకు గురై అస్వస్థతకు గురయ్యింది. వెంటనే బంధువులు ఆదోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇంటి ప్రాంగణంలో తెల్లవారుజామున బయటికి వెళ్లడంతో పాముకాటు వేసిందని బంధువులు తెలిపారు. చికిత్స చేసిన వైద్యులు, మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


దేవరగట్టులో పూజలందుకుంటున్న మాళమల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారాన్ని పురస్కరించుకుని పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహా మంగళహారతి, అర్చనతో పాటు రుద్రాభిషేకం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

అనాథ బాలికలకు ఆర్థిక సాయం


బాలికలకు నగదును అందజేస్తున్న దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సాయిబాబా

ఆదోని రూరల్: ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలోని అనాథ బాలికలకు కర్నూలు జిల్లా దూదేకుల సంఘం తరపున రూ.1.05 లక్షలు నగదు ఆర్థిక సాయం అందజేసినట్లు దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయి బాబా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దూదేకుల కాసీంసాబు, శేఖమ్మ దంపతులు మృతిచెందడంతో వారి ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారారని చెప్పారు. వారికి అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు. వారి చదువుకు సహకరిస్తామన్నారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాబుసాబ్, జిల్లా నాయకులు కాశీంసా, పీరుసాబ్, ఇస్వీ షేక్షావలి, సాబేష్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి


వర్సిటీ హాస్టల్‌లో భోజనం గురించి ఆరా తీస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లుతో కలిసి వీసీ ఆదివారం మధ్యాహ్నం భోజన సమయంలో వర్సిటీ మెస్స్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో వసతులను మెరుగు పరుస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉన్నత విద్య కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నతంగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు.

కాకర 20.. కాసర 200


ఎమ్మిగనూరులో తోపుడు బండిపై రూ.20లకే కిలో కాకర విక్రయిస్తున్న వ్యాపారి


తోపుడు బండిపై విక్రయిస్తున్న కాసరకాయలు

ఎమ్మిగనూరుటౌన్: నిన్న మొన్నటి వరకు రూ.100లు పలికిన కాకర కాయల ధర అమాంతం దిగివచ్చింది. కేవలం రూ.20లకే కిలో కాకర కాయలంటూ తోపుడు బండ్లపై వ్యాపారులు మైక్‌లు పెట్టి మరీ విక్రయిస్తున్నారు. ఇందుకు భిన్నంగా కాసర (చిన్నకాకర) కిలో రూ.200లు పలుకుతున్నాయి. వాటినీ పట్టణంలో వ్యాపారులు విక్రయిస్తున్నారు. అయితే కాకర చౌకగా లభిస్తుండటంతో ప్రజలు వాటినే ఎక్కువగా కొనేస్తున్నారు. కాసరవైపు మొగ్గు చూపడంలేదు. వర్షాధారం, బోర్ల కింద సాగు చేసిన కాకర పంట విరివిగా పండటంతో మార్కెట్‌లో కాకర పంట దిగుబడులు మార్కెట్‌ను ముంచెత్తాయి. యాంటి ఆక్సిడెంట్లు, రోగ నిరోధక శక్తిని ఇవ్వడంతో పాటు బ్లడ్‌షుగర్ లెవెల్స్ తగ్గించడంలో, చెడు కొలెస్ట్రాల్ కరిగించి మంచి కొలెస్ట్రాల్ పెంచడంలో కాకర ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతుండటంతో ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.